సాక్షి పల్నాడు

మంగళవారం । 8 । అక్టోబర్ । 2024




అభివృద్ధి పనులు పరిశీలన

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరులోని మహంకాళీ దేవస్థాన అభివృద్ధి పనులను సోమవారం దేవదాయ శాఖ ఉప కమిషనర్ కె.జి.శ్రీనివాస్ పరిశీలించారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 30,722 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా, దిగువకు 33,543 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 588.60 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకు 10,120 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

న్యూస్‌రీల్

లలితా త్రిపుర సుందరిదేవిగా బాలచాముండేశ్వరీదేవి



అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతిలో శ్రీదేవీ శరన్నవరాత్ర మహోత్సవాలలో భాగంగా బాలచాముండిక సమేత అమరేశ్వరాలయంలో సోమవారం అమ్మవారిని లలితా త్రిపుర సుందరిదేవిగా అలంకరించారు. ఉత్సవాల ఐదో రోజు భక్తులు పెద్దసంఖ్యలో హాజరై పూజలు చేశారు. శరన్నవరాత్రి మహోత్సవాలలో ఈరోజు అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, దేవి ఖడ్గమాల, త్రిశల, లలితా సహస్ర నామార్చన, శ్రీచక్రార్చన పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలోని జ్వాలాముఖి, మహిషాసురమర్దిని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సీనియర్ సిటిజన్స్ కరపత్రం ఆవిష్కరణ



నరసరావుపేట: నేషనల్ యాక్షన్ ప్లాన్ ఫర్ సీనియర్ సిటిజన్స్ కార్యక్రమంలో భాగంగా మండల స్థాయిలో వయో వృద్ధుల ప్రయోజనార్థం ప్రజలలో అవగాహన కల్పించేందుకు సంబంధిత శాఖ ప్రచురించిన కరపత్రాన్ని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆవిష్కరించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని ప్రజా పరిష్కార వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో వయోవృద్ధుల సంక్షేమ శాఖ సంచాలకులు సువార్త, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు పాల్గొన్నారు.

డీటీసీగా సీతారామిరెడ్డి బాధ్యతల స్వీకారం



పట్నంబజారు: రవాణా శాఖ డెప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా సోమవారం కె.సీతారామిరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. స్వర్ణభారతీనగర్‌లోని ఆర్టీఏ కార్యాలయంలో ఆయన చాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. విజయవాడ డీటీసీగా పనిచేస్తున్న ఆయన్ను సాధారణ బదిలీల్లో భాగంగా గుంటూరుకు బదిలీ చేశారు. ఇప్పటి వరకు డీటీసీగా విధులు నిర్వర్తించిన షేక్ కరీం ఏలూరుకు బదిలీ అయ్యారు. ఈ మేరకు సీతారామిరెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు.

పవర్ లిఫ్టింగ్‌లో జ్ఞాన దివ్యకు పతకాలు



తెనాలి రూరల్: దక్షిణాఫ్రికాలో ఆదివారం జరిగిన కామన్వెల్త్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో తెనాలి మండలం కొలవరం గ్రామానికి చెందిన నాగం జ్ఞానదివ్య ప్రతిభ కనబర్చారు. ఆమె 84 ప్లస్ జూనియర్ విభాగంలో నాలుగు కాంస్య పతకాలు సాధించారు. స్క్వాట్‌లో 160 కిలోలు, బెంచ్ ప్రెస్‌లో 55 కిలోలు, డెడ్ లిఫ్ట్‌లో 157.5 కిలోల బరువు ఎత్తారు. మొత్తం 372.5 కిలోల బరువులను ఎత్తి నాలుగు కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా నాగ దివ్యను కోచ్ కొల్లిపర నాగశిరీష, జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కోమాకుల విజయభాస్కర్, ప్రధాన కార్యదర్శి షేక్ సంధాని, గ్రామస్తులు అభినందించారు.

యార్డుకు 44,193 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 44,193 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 39,293 అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.8,500 నుంచి రూ. 16,300 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.8,000 నుంచి 18,600 వరకు లభించింది. ఏసీ కామన్ రకానికి రూ. 9,500 నుంచి రూ. 16,000 వరకు లభించింది.





నగరోత్సవంలో ఊరేగుతున్న ఉత్సవమూర్తులు, (ఇన్‌సెట్‌లో) మహాచండీదేవి అలంకరణలోని దుర్గమ్మకు హారతిస్తున్న అర్చకుడు



త్రిశక్తి.. సర్వసిద్ధి

శ్రీమహాచండీదేవిగా పూజలందుకున్న దుర్గమ్మ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న దసరా ఉత్సవాలలో సోమవారం అమ్మవారు మహాచండీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున 4 గంటలకు అమ్మవారికి విశేష అలంకరణ, పూజాది కార్యక్రమాల అనంతరం ఆలయ ఈవో రామరావు, పోలీసు, రెవెన్యూ అధికారులు తొలి దర్శనం చేసుకున్నారు. ఆదివారం వీఐపీల తాకిడితో సామాన్య భక్తజనం తీవ్ర ఇబ్బందులకు గురికాగా, ఈ ప్రభావంతో సోమవారం దర్శనాలపై కనిపించి అన్ని క్యూలైన్లు ఖాళీగా దర్శనమిచ్చాయి. వీఐపీల పేరిట విచ్చేసిన భక్తులు ఓం టర్నింగ్ మొదలు, కొండపై సమాచార కేంద్రం, ప్రొటోకాల్ కేంద్రం, గాలిగోపురం వద్ద భారీగా నిలిచిపోయారు. ఉత్సవాలలో అత్యంత కీలకమైన మూలా నక్షత్రానికి ఒక రోజే గడువు ఉండటంతో పోలీసు, రెవెన్యూ అధికారులు ఒకటికి, రెండు సార్లు ఆలయ ప్రాంగణంలో పర్యటిస్తూ ఏర్పాట్లను సమీక్షించారు. కలెక్టర్ సృజన, సీపీ రాజశేఖర్‌బాబు, ఈవో రామరావు ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లను సమీక్షించారు. ప్రత్యేక ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చనలకు సైతం ఉభయదాతలు పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆదాయం రూ. 82.13 లక్షలు

దసరా ఉత్సవాలలో సోమవారం దేవస్థానానికి రూ.82.13 లక్షల మేర ఆదాయం సమకూరింది. రూ.500 టికెట్ల విక్రయం ద్వారా రూ.34.73 లక్షలు, రూ.300 టికెట్లతో రూ.9.82 లక్షలు, రూ.100 టికెట్ల విక్రయంపై రూ.6.21 లక్షలు, లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ. 28.58 లక్షలు, ప్రత్యేక పూజలు, ఆర్జిత సేవల టికెట్ల విక్రయం ద్వారా రూ.1.42 లక్షలు, ఇతర సేవల ద్వారా రూ.1.37 లక్షల ఆదాయం లభించినట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు.



కుటుంబ సమేతంగా కుంకుమ పూజ..

నగరోత్సవం.. ఆనంద పరవశం

దసరా ఉత్సవాలలో భాగంగా సోమవారం ఆది దంపతుల నగరోత్సవ సేవ కనుల పండువగా సాగింది. మల్లేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాల వద్ద శ్రీ గంగా పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి ఉత్సవ మూర్తులకు ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం ఊరేగింపును ప్రారంభించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ భక్త జనుల కోలాట నృత్యాల నడుమ ఆది దంపతులు ముందుకు సాగగా, భక్తులు జయజయ ధ్వానాలతో పాదం కలిపారు. కనకదుర్గనగర్, రథం సెంటర్, కెనాల్‌రోడ్డు, ఘాట్ రోడ్డు మీదగా ఆలయానికి చేరుకుంది.

అన్న ప్రసాదం తనిఖీ..

దసరా ఉత్సవాలలో సాయంత్రం వేళ భక్తులకు దేవస్థానం పంపిణీ చేసే అల్పాహారాన్ని ఆలయ ఈవో రామరావు సోమవారం తనిఖీ చేశారు. మహా మండపం ఎదురుగా ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణను ఈవో ఆకస్మికంగా తనిఖీ చేసి ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. భక్తులు కోరినంత అల్పాహారాన్ని అందించి వారి ఆకలిని తీర్చాలని సిబ్బందికి సూచించారు.

పాట్లు.. పడిగాపులు

కూటమి నేతల తీరుతో భక్తులకు నీరసం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తొలి దసరా ఉత్సవాలలో భక్తులు అమ్మవారి దర్శనానికి నానా తంటాలు పడుతున్నారు. కూటమి నాయకుల సిఫారసులు, పోలీసుల అత్యుత్సాహం, శాఖల మధ్య సమన్వయ లోపం వెరసి భక్తులకు పగలే చుక్కలు కనిపిస్తున్నాయి. టికెట్ కొనుగోలు చేసినా గంటల కొద్దీ క్యూలైన్లలో పడిగాపులు కాయాల్సి వస్తోందంటూ భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సిఫారసులతో యాతన..

నగరంలో మూడు నియోజకవర్గాల శాసనసభ్యులతో పాటుగా ఎంపీ కార్యాలయం నుంచి వస్తున్న సిఫారసులతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. దేవస్థానం వీవీఐపీల కోసం యాప్ తయారు చేసి అందులో శాసనసభ్యులకు, ఎంపీకు ఇతర ప్రజాప్రతినిధులకు అవకాశం కల్పించింది. వాటి ద్వారా బుక్ చేసుకున్న అధికార పార్టీలకు చెందిన నాయకులు కొండపైకి పోటెత్తుతున్నారు. ఫోన్‌లో వచ్చిన మెసేజ్‌లను పదేపదే చూపిస్తూ దానిని పలుమార్లు వినియోగిస్తున్నారు. వారంతా నేరుగా చిన్న రాజగోపురం వద్దకు వచ్చి అక్కడ ఉన్న సిబ్బందిపై విరుచుకు పడుతున్నారు. దానికి తోడు ఆయా కార్యాలయాల నుంచి ఫోన్లు రావటంతో వారందరినీ వీఐపీలుగా గుర్తించి వారిని లోపలకు వదులుతున్నారు. దీనివల్ల టికెట్లు కొనుగోలు చేసి వెళ్తున్న భక్తులకు గంటల కొద్దీ ఆలస్యమవుతోంది.

ఉత్సవ కమిటీతో తలనొప్పులు

కూటమి ప్రభుత్వం దసరా ఉత్సవాలకు నియమించిన సేవా కమిటీతో అటు అధికారులకు ఇటు భక్తులకు తీవ్ర స్థాయిలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఏకంగా 56 మందితో ఉన్న ఈ జంబో కమిటీలో ఒక్కొక్కరికీ 20 మంది వరకూ దర్శనం చేయించుకునేందుకు అనధికారికంగా అనుమతినిచ్చినట్లు తెలిసింది. ఎవరైనా గట్టిగా అడిగితే ఫలానా ఎమ్మెల్యే తాలుకా లేదా ఎంపీ బంధువునంటూ హడావుడి చేసి మరి లోపలకు వెళ్తున్నారు. దీని ప్రభావం రూ.500 క్యూలైన్‌పై పడి అందులోని భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

గతంలో ఎన్నడూ లేదు..

గతంలో ఎన్నడూ ఈ విధమైన పరిస్థితులు లేవని ఆలయ అధికారులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం రావటం, అందులో మూడు పార్టీల నేతలు ఎవరికి వారు తమ మెహర్బాని కోసం ఆలయాన్ని వాడుకుంటున్నారంటూ విమర్శిస్తున్నారు.



క్యూలైన్లో గంటల కొద్దీ వేచి ఉండటంతో నీరసిస్తున్న చిన్నారులు

ఐసీఐసీఐలో డిపాజిట్ల కుంభకోణం

- అధిక వడ్డీ ఆశ చూపి రూ.కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లు
- చిలకలూరిపేట, నరసరావుపేటలో వెలుగు చూసిన వైనం
- ఒక్కొక్కటి వెలుగు చూస్తున్న మేనేజర్ రాజేష్ లీలలు
- డిపాజిట్ల స్కాంపై విచారణ చేపట్టిన బ్యాంక్ ఉన్నతాధికారులు



డిపాజిట్ బాండ్‌లను పరిశీలిస్తున్న ఆర్ఎం సందీప్ మెహరా

నరసరావుపేటటౌన్: ఐసీఐసీఐ బ్యాంక్‌లో చోటుచేసుకున్న అక్రమాలు ఒక్కొక్కటి వెలుగు చూస్తున్నాయి. చిలకలూరిపేట బ్యాంకులో కోట్ల రూపాయల కుంభకోణం మరువక ముందే నరసరావుపేటలో మరొకటి వెలుగు చూసింది. బ్యాంకు మేనేజర్ రాజేష్ గతంలో నరసరావుపేటలో పనిచేసి బదిలీపై చిలకలూరిపేటకు వెళ్లారు. అక్కడ ఖాతాదారులకు అధిక వడ్డీ ఆశచూపి సుమారు తొంభై మంది వద్ద నుంచి కోట్ల రూపాయలు డిపాజిట్ చేయించారు. కొన్ని నెలలు వారి ఖాతాలో వడ్డీ జమ చేసి రెండు నెలలుగా డబ్బులు సకాలంలో జమ చేయక పోవటంతో అక్రమ వ్యవహారం వెలుగు చూసింది. దీంతో బాధితులంతా ఒక్కొక్కరు బ్యాంక్‌కు క్యూ కట్టారు. ఈ పరిణామంతో బ్యాంక్ మేనేజర్ రాజేష్ అజ్ఞాతంలోకి వెళ్లాడు. గతంలో నరసరావుపేట ఐసీఐసీఐ బ్యాంక్‌కు మేనేజర్‌గా రాజేష్ పనిచేశారు. అతడిపై ఆరోపణలు రావటంతో తమ సొమ్ము భద్రతపై డిపాజిట్ దారులు ఆందోళన చెంది సోమవారం అరండల్‌పేటలోని బ్యాంకు వద్దకు చేరుకున్నారు. అదే సమయంలో రాజేష్ అక్రమాలపై బ్యాంక్ ఆర్ఎం సందీప్ మెహరా విచారణ చేస్తున్నారు. ఆయన్ను కలిసి బాధితులు తమ వద్ద ఉన్న డిపాజిట్ బాండ్‌లను చూపి సుమారు రూ.కోటి రూపాయల పై చిలుకు కట్టి మోసపోయామని గోడును వెళ్లబోసుకున్నారు. సుమారు పది మంది బాధితులు వారి అనుచరులతో బ్యాంక్ వద్దకు చేరుకోవటంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు బ్యాంకు వద్దకు చేరుకొని బందోబస్తు నిర్వహించారు. ఖాతాదారులను బ్యాంకు అధికారులు లోపలికి పిలిచి డిపాజిట్‌ల వ్యవహారంపై విచారణ జరిపి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వటంతో బాధితులు శాంతించారు. ఈ వ్యవహారంపై బ్యాంక్ అధికారులతో మాట్లాడేందుకు విలేకరులు ప్రయత్నించగా వారు నిరాకరించారు. దీంతో బ్యాంక్‌లో ఎంత మేరకు స్కాం జరిగిందన్నా విషయం స్పష్టత రాలేదు.

రెండు నెలలుగా వడ్డీ రావటంలేదు



తనతో పాటు తన కుమార్తెకు చెందిన నగదు మూడు విడతలగా రూ.65 లక్షలు ఐసీఐసీఐ బ్యాంక్‌లో రాజేష్ మేనేజర్‌గా ఉన్న సమయంలో డిపాజిట్ చేశా. రెండు నెలలుగా వడ్డీ జమ కావటం లేదు. చిలకలూరిపేట బ్యాంక్‌లో రాజేష్ మోసానికి పాల్పడ్డాడని తెలిసి తమ వద్ద ఉన్న డిపాజిట్ బాండ్లను తీసుకొచ్చి అధికారులను కలిశా. బాండ్లు ఒరిజినలో కాదో విచారణ అనంతరం చెబుతామన్నారు. దీంతో ఆందోళనగా ఉంది.

– జి.వెంకటేశ్వరరెడ్డి

స్మార్ట్‌గా పోస్టల్ సేవలు

ఆత్మీయుల ఊసులను అక్షరాలుగా మోసుకొచ్చే ఉత్తరాలకు కాలం చెల్లిపోయింది. టెలిగ్రామూ కనుమరుగైంది. మసకబారిన పోస్టల్ శాఖకు గత వైభవాన్ని తెచ్చేలా స్మార్ట్ సొబగులను అద్దుతున్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో వేగంగా అడుగులేస్తోంది. ఆత్మబంధువు అవుతోంది. ఈనేపథ్యంలో ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు పోస్టల్ వారోత్సవాలు నిర్వహించనుంది.

- పోస్టల్ బ్యాంక్ ద్వారా గ్రామీణ ప్రజలకు చేరువ
- మొబైల్ మనీట్రాన్స్‌ఫర్, ఎలక్ట్రానిక్ మనీయార్డర్ సేవలు
- జిల్లాలో నరసరావుపేట, సత్తెనపల్లిలో ప్రధాన తపాలా కార్యాలయాలు
- నరసరావుపేట హెడ్ పోస్టాఫీస్‌లో పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ఏర్పాటు
- బ్యాంక్‌లకు దీటుగా నరసరావుపేట, మాచర్లలో ఏటీఎంలు ఏర్పాటు
- రేపు ప్రపంచ తపాలా దినోత్సవం.. 9–15 వరకు వారోత్సవాల నిర్వహణ



సత్తెనపల్లి ప్రధాన తపాలా కార్యాలయంలో బ్యాంక్‌ల మాదిరిగా కౌంటర్

సత్తెనపల్లి: ప్రజలకు మరింత చేరువయ్యేందుకు పోస్టల్ శాఖ వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తోంది. బ్యాంకులు, ప్రైవేటు ఫైనాన్స్ సంస్థల కంటే మిన్నగా ఖాతాదారులకు మెరుగైన ఆర్థిక సేవలు అందించేందుకు సిద్ధమైంది. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలా పాలంటే గుర్తుకొచ్చేది పోస్టాఫీసులే. మారుతున్న కాలానికి అనుగుణంగా పోస్టల్ శాఖ టెక్నాలజీని అందిపుచ్చుకుంది. జాబులు, ఇంగ్లాండ్ లెటర్లు మాయమయ్యాయి. వాటి స్థానంలో సెల్‌ఫోన్ సేవలు వచ్చినా పోస్టల్ శాఖ ప్రాధాన్యం ఏమాత్రం తగ్గలేదు. ఐకాల్ లెటర్లు, ఇంటర్వ్యూ లెటర్లు, అపాయింట్మెంట్ ఆర్డర్లు... వీటిని తీసుకొని ఖాకీ డ్రస్ వేసుకొని ప్రతిరోజు ఉదయం 10 నుంచి 2 గంటల మధ్య ఆయా ప్రాంతాల్లో తిరుగుతూ అందరినీ పలకరిస్తూ మీకు ఈ లెటర్ వచ్చిందని చెబుతూ ఎందరో ఆశలకు జీవం పోసి ఉత్సాహపరిచే ఆత్మీయులుగా ఉంటారు పోస్టుమాన్‌లు. సుమారు 18 ఏళ్ల కిందట సెల్ ఫోన్లు లేని రోజుల్లో పోస్టాఫీసులు, పోస్టుమెన్‌లు ఆత్మబంధువుల్లా కనిపించేవారు. పిన్‌కోడ్‌లో ఉన్న ఆరు అక్షరాల్లో మొదటి రెండక్షరాలు రాష్ట్రాన్ని, మధ్యలో ఉన్న రెండక్షరాలు జిల్లాను, చివరి రెండు అక్షరాలు ప్రాంతాన్ని తెలుపుతాయి.

సెల్‌ఫోన్ రాకతో...

సెల్ ఫోన్ల ద్వారా ఒకరికొకరు మెసేజ్‌ల రూపంలో ప్రస్తుతం వాట్సాప్, ట్విట్టర్, టెలిగ్రామ్ ద్వారా సమాచారం మార్పిడి చేసుకుంటున్నారు. మనీయార్డర్ల స్థానంలో ఏటీఎంలు, మనీ ట్రాన్స్‌ఫర్ రావడంతో పోస్టాఫీస్‌కి వెళ్లేవారు కరువయ్యారు. దీంతో పోస్టాఫీస్‌కి వెళ్లి ఉత్తరాలు కొని డబ్బాలో వేసే సంస్కృతికి కాలం చెల్లిపోయింది. కేవలం ప్రభుత్వ కార్యాలయాల ఉత్తర ప్రత్యుత్తరాలకు పోస్టాఫీస్‌ను వాడుతున్నారు. ఈ నేపథ్యంలో కొత్తగా ప్రవేశపెట్టిన పథకాలతో మళ్లీ పోస్టా ఫీస్ వైపు అడుగులు పడుతున్నాయి.

ఐపీపీబీతో సేవలు...

నరసరావుపేటలో ఇండియన్ పోస్టల్ పేమెంట్స్ బ్యాంక్(ఐపీపీబీ)ను పోస్టల్ శాఖ ప్రారంభించింది. ఆ శాఖలో ఇది ఒక విప్లవం. పల్నాడు జిల్లాలో నరసరావుపేట, సత్తెనపల్లిలో ప్రధాన తపాలా కార్యాలయాలు ఉన్నాయి. నరసరావుపేట డివిజన్ పరిధిలో 51 సబ్ పోస్టాఫీస్‌లు, 386 బ్రాంచ్‌లు ఉన్నాయి. కొత్తగా 60 బ్రాంచ్‌లు పెరిగాయి. ఇందులో 980 మంది ఉద్యోగులు ప్రతి రోజూ ప్రజలకు సేవలు అందిస్తున్నారు. గ్రామాల్లో ఉన్న పోస్టల్ సిబ్బందికి బయోమెట్రిక్ మిషన్ అందించారు. దీని ద్వారా బ్యాంకుల్లో అకౌంట్ ఉండి ఐపీపీబీలో అకౌంట్ ఉంటే బ్యాంక్ అకౌంట్‌లో ఉన్న నగదును మనం కావాలని పోస్టల్ సిబ్బందికి ఫోన్ చేసి చెబితే బయోమెట్రిక్ తీసుకొని రూ.5 నుంచి రూ.10 వేల వరకు నగదు అందిస్తారు. ప్రస్తుతం సీనియర్ సిటిజన్లకు ఈ పథకం చాలా ఉపయోగపడుతోంది.

ఇవీ పథకాలు...

ప్రైవేట్ సంస్థలు, బ్యాంక్‌లకు దీటుగా పోస్టాఫీస్‌లో కూడా ఆన్‌లైన్ సేవలు, ఏటీఎంలు అందుబాటులోకి వచ్చాయి. మొబైల్‌మనీ ట్రాన్స్‌ఫర్, ఎలక్ట్రానిక్ మనీయార్డర్, మై స్టాంప్ పథకం, స్పీడ్ పోస్టుల సేవలు, ఆధార్ సేవలు అందుబాటులోకి తెచ్చింది. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట ప్రధాన తపాలా కార్యాలయంలో పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ద్వారా ఆ సేవలు అందుబాటులో ఉన్నాయి. స్పీడ్ పోస్ట్, వ్యక్తిగతంగా మన ఫొటోలతో విడుదల చేసే మై స్టాంప్, రికరింగ్ డిపాజిట్లు, మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్, సేవింగ్స్, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, స్టాంపుల కలెక్షన్, సుకన్య సంవృద్ధి యోజన, ఇన్సూరెన్స్ పథకాలు ప్రజలను ఆకట్టుకుంటున్నాయి.

ప్రతి అర్జీ పరిష్కారం కావాలి



కలెక్టరేట్‌లో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ గనోరే

- జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు
- కలెక్టరేట్ ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 104 వినతులు

నరసరావుపేట: పీజీఆర్ఎస్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదు పరిష్కారం కావాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరేతో కలసి నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి సుమారు 104 అర్జీలు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కారం అవుతాయనే నమ్మకంతో వివిధ ప్రాంతాల నుంచి అర్జీదారులు ఇక్కడకి వస్తుంటారని అన్నారు. వారి సమస్యలను సావధానంగా విని, సత్వర పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యకు నాణ్యమైన పరిష్కారం చూపాలని, ఆ పరిష్కారంతో అర్జీదారు సంతృప్తి చెందాలని సూచించారు.

పొలంలోకి వెళ్లకుండా అడ్డుపడుతున్నారు



నేను సుమారు 15 ఏళ్ల క్రితం మా గ్రామంలో 5.5 ఎకరాల పొలం కొనుక్కున్నా. అందులో ప్రతి ఏడాది మిర్చి, పత్తి వేస్తుంటా. గతేడాది వరకు నా పొలంకు వెళ్లేందుకు ఎవరూ అడ్డుచెప్పలేదు. అయితే ఈ ఏడాది నా పొలం పక్కనే ఉన్న శంకర్, కుమార్ పొలం వెళ్లేందుకు దారి ఇవ్వబోమని చెప్పి అడ్డుకుంటున్నారు. అలాగే స్థానిక ఎస్‌బీఐ బ్యాంకులో రుణం తీసుకుందామని వెళ్తే నీ పొలం పేరుతో రుణం తీసుకున్నారని బ్యాంకు మేనేజర్ చెబుతున్నారు. ఈ రెండు సమస్యలపై నాకు న్యాయం చేయండి.

–భుక్యానాయక్, గండిగనుముల, బొల్లాపల్లి మండలం

సబ్‌డివిజన్ చేసి మాకు న్యాయం చేయండి

మేమందరమూ గుంటగార్లపాడులోని సర్వే నంబరు 110/3లో ఉన్న స్థలాలను 2019లో కొనుగోలు చేశాం. అయితే 2020లో దేవదాయశాఖ వారు పక్కనే ఉన్న వారి స్థలంతో పాటు మా సర్వే నంబరులోని స్థలాలను రిజిస్ట్రేషన్ చేయకుండా బ్లాక్ చేయించారు. దీంతో తామంతా ఇళ్లు కట్టుకోలేక, అమ్ముకోలేక ఐదేళ్లుగా ఇబ్బందులు పడుతున్నాం. ఆ సర్వే నంబరును సబ్ డివిజన్ చేసి మాకు న్యాయం చేయండి.

–టి.కోటేశ్వరరావు, జి.వెంకటశ్రీనివాసరావు, పి.సుబ్బారావు, జి.వెంకటరావు



సర్వే నంబరు సబ్‌డివిజన్ చేసి తమకు న్యాయం చేయాలని కోరుతున్న స్థల యజమానులు

క్లుప్తంగా

పట్టభద్ర ఓటర్లుగా నమోదు కండి



ఏపీ ఎన్జీఓ సంఘ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఘంటసాల శ్రీనివాసరావు

గుంటూరు మెడికల్: పట్టభద్రులైన ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు అందరూ పట్టభద్ర ఓటర్లుగా నమోదు చేయించుకోవాలని గుంటూరు జిల్లా ఎన్జీజీఓ సంఘ అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్థానిక ఎన్జీవో హోంలో సోమవారం జరిగిన ఎన్జీజీవో ప్రతినిధుల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగులే కాదు వారి కుటుంబ సభ్యులు కూడా పట్టభద్రులుగా ఉన్నారన్నారు. వారిని కార్యక్రమంలో భాగస్వాములను చేసి, ఓటర్లుగా నమోదు చేసి ప్రజాస్వామ్య స్ఫూర్తిని ప్రదర్శించాలని కోరారు. అన్ని శాఖల్లో ఉద్యోగులందరికీ ఈ విషయాన్ని తెలియజేయాలని ఆయా శాఖలోనే సంఘ నాయకులు, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లు అందరూ కూడా నవంబర్ 6 వరకు జరిగే ఈ ఓటర్ నమోదు కార్యక్రమం గురించి ఉద్యోగులను చైతన్యపరిచి ఓటరు నమోదు కార్యక్రమాన్ని జయప్రదంగా చేయాలన్నారు. ఎన్జీజీఓ హోమ్‌లో ఓటరు నమోదుకు సంబంధించిన సదుపాయ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. నవంబర్ 6 వరకు సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్స్ వారి కుటుంబ సభ్యులు ఈ కేంద్రం ద్వారా ఫారం 18ని పొందవచ్చన్నారు. సమావేశంలో జిల్లా ఎన్జీజీవో సంఘ కార్యదర్శి శెట్టిపల్లి సతీష్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.వెంకటరెడ్డి, జిల్లా మహిళా సంయుక్త కార్యదర్శి కె.శివజ్యోతి, నగర అధ్యక్షుడు ఎస్‌పీఎస్ సూరి, కార్యదర్శి కల్యాణ్ కుమార్, విజయ్‌బాబు, జిల్లా మహిళా విభాగం కన్వీనర్ కె.లక్ష్మీరమ్య, పట్టణ మహిళా విభాగం చైర్‌పర్సన్ పి.లక్ష్మి ప్రసన్న, బి.శైలజ, కోటమ్మ, పద్మజ, సునీత, పలు శాఖల నుంచి వచ్చిన ఎన్జీజీవో నాయకులు పాల్గొన్నారు.

అధిక లాభాలు ఆశచూపి మోసం

- రూ.లక్ష కడితే ఏడాదిలో రూ.1.80లక్షలు, రోజుకు రూ.900 ఇస్తామంటూ ప్రచారం
- ప్రజల నుంచి రూ.లక్షలు వసూలు చేసి ప్లేటు ఫిరాయించిన త్రిపుల్ ఆర్ సంస్థ
- జిల్లా ఎస్పీకి ఫిర్యాదుచేసిన బాధితులు



జిల్లా పోలీసు కార్యాలయంలో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాధితులు

నరసరావుపేట: అధిక లాభాలు ఇస్తామంటూ ఆశ చూపి వందలాది మంది వద్ద రూ.లక్షలు వసూలు చేసి ఇప్పుడు ప్లేటు ఫిరాయించారని, మోసగాళ్లను పట్టుకుని తమకు న్యాయం చేయాలని పలువురు బాధితులు సోమవారం జరిగిన పోలీసు గ్రీవెన్స్‌లో ఎస్పీ ఎదుట మొరపెట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. త్రిపుల్ ఆర్ (ఆర్ఆర్ఆర్) గ్రూపు ఎండీ ఆర్.రాజారావు హైదరాబాదులో ఓక్‌లాండ్ ఇన్‌ఫ్రా ప్రైవేటు లిమిటెడ్ పేరుపై జూబ్లీహిల్స్ కేంద్రంగా కార్యాలయం నిర్వహిస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. నరసరావుపేటలో తమ సంస్థ అగ్రి సంస్థగా చెప్పుకొని గ్రూప్ 18 వార్షికోత్సవం జూలై 14న నిర్వహించారు. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే చదలవాడ హాజరయ్యారని బాధితులు తెలిపారు. తమసంస్థలో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు ఇస్తామని, ఏడాదిలో ఒక లక్షకు రూ.1.80లక్షలు చెల్లిస్తామని, రోజుకు రూ.900 చొప్పున తిరిగి చెల్లిస్తామని నమ్మబలికారన్నారు. దీంతో తాము కూడా ఆశపడి రూ.లక్ష, రూ.50వేలు పెట్టుబడి పెట్టామన్నారు. ఇలాగే చాలామంది ఆశపడి బంగారం తాకట్టుపెట్టి, వడ్డీలకు అప్పులుచేసి, క్రెడిట్ కార్డుల ద్వారా బ్యాంకుల్లో నగదు తీసుకొని డబ్బులు పెట్టుబడి పెట్టారన్నారు. సభ్యులుగా చేరిన తమ పేరుపై ఒక ఐడీ క్రియేట్ చేశారన్నారు. యాప్ ద్వారా డైలీ పే అవుట్స్ ఇస్తామంటూ నమ్మించారని, కొన్నిరోజులు యాప్‌లో, అకౌంట్‌లో బాగానే డబ్బులు జమచేసి అర్ధాంతరంగా డబ్బులు వేయటం ఆపేశారన్నారు. తాము ఫోన్ చేస్తే ఆ గ్రూప్ ఎండీ రాజారావు, అకౌంటెంట్ అనీల్‌కుమార్, కో-ఆర్డినేటర్ చలపతిరావు స్పందించ లేదన్నారు. నెల క్రితం అనివార్య కారణాల వలన ఇప్పటివరకు ఆగిన పే అవుట్స్ మళ్లీ అక్టోబరు ఒకటవ తేదీ నుంచి అందరి అకౌంట్లలో జమ చేస్తామని వాట్సప్ మెసేజ్ పెట్టి సభ్యులను నమ్మించి మభ్యపెట్టారన్నారు. వీరు ఒక్క నరసరావుపేటలోనే గాకుండా విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, చిలకలూరిపేట, వినుకొండ, పెదనందిపాడు, పలు గ్రామాల ప్రజలను ఈ గ్రూప్‌లో చేర్పించి, లక్షలకు లక్షలు పెట్టుబడి పెట్టించి బలిచేశారన్నారు. ఒక్క పెదనందిపాడు పరిసర ప్రాంతాల వారే సుమారు 480మంది బాధితులుగా ఉన్నారన్నారు. అధిక వడ్డీలు ఇస్తామంటూ ఆశ చూపించి తమ జీవితాలతో ఆడుకున్న ఆ గ్రూపు యజమానులు, ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని ఎస్పీని వారు కోరారు. ఎస్పీని కలిసిన వారిలో నరసరావుపేటకు చెందిన బాధితులు షేక్ మస్తాన్‌వలి, టి.వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

యువకుడి హత్య కేసును ఛేదించిన పోలీసులు

- వేధింపులతో విసిగి అంతమొందించిన స్నేహితుడు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జనార్దనరావు. పక్కన ట్రైనీ డీఎస్పీ భార్గవి, సీఐ శ్రీనివాసరావు

తెనాలి రూరల్: బుర్రిపాలెం రోడ్డు నుంచి పూలే కాలనీ టిడ్కో గృహాలకు వెళ్లే దారిలో ఈనెల 1వ తేదీ అర్ధరాత్రి దాటాక జరిగిన యువకుడి హత్య కేసును పోలీసులు ఛేదించారు. మృతుడి వేధింపులు భరించలేక స్నేహితుడే హత్యకు పాల్పడ్డాడు. తెనాలి రూరల్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వివరాలను డీఎస్పీ బి. జనార్దనరావు వెల్లడించారు. బుర్రిపాలెం గ్రామానికి చెందిన పేరిశెట్టి కోటేశ్వరరావు బుర్రిపాలెం రోడ్డు నుండి పూలే కాలనీ టిడ్కో గృహాలకు వెళ్లే దారిలో నిర్మానుష్య ప్రాంతంలో దారుణ హత్యకు గురయ్యాడు. దీనిపై ట్రైనీ డీఎస్పీ భార్గవి, రూరల్ సీఐ బెల్లం శ్రీనివాసరావులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. హత్యకు పాల్పడింది కోటేశ్వరరావు స్నేహితుడు, సెల్‌ఫోన్ రిపేరు షాపు నిర్వాహకుడైన నాజరుపేటకు చెందిన షేక్ ఆదామ్ షఫీగా గుర్తించారు. మృతుడు కోటేశ్వరరావు, నిందితుడు ఆదామ్ షఫీ ఇద్దరూ స్నేహితులు. కోటేశ్వరరావు దగ్గర షఫీ గతంలో కొంత నగదు అప్పుగా తీసుకున్నాడు. ఈ క్రమంలో దాన్ని తీర్చే విషయమై తరచూ వీరి మధ్య ఘర్షణ జరుగుతోంది. మృతుడు కోటేశ్వరరావు, షఫీకి పదే పదే ఫోన్లు చేసి అప్పు తీర్చమని లేదంటే అతని భార్యను పంపమంటూ అసభ్యకరంగా మాట్లాడుతున్నాడు. దీంతో విసిగిపోయిన షఫీ అతడ్ని హతమార్చాలని నిర్ణయించుకున్నాడు. ఈ నెల 1వ తేదీ రాత్రి మద్యం తాగుదామని చెప్పి బుర్రిపాలెం రోడ్డులోని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకువెళ్లాడు. వెంట తెచ్చుకున్న బటన్ కత్తితో కోటేశ్వరరావు గొంతు కోసి హత్య చేసినట్లు డీఎస్పీ తెలిపారు. కేసును చాకచక్యంగా ఛేదించిన ట్రైనీ డీఎస్పీ భార్గవి, రూరల్ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ సీహెచ్. ప్రతాప్, హెడ్ కానిస్టేబుళ్లు ఎ. బాలాజీ, వి. రవి, డి. రవిలను డీఎస్పీ అభినందించారు.

రాష్ట్రస్థాయి ఆట్యాపాట్యా విజేతలుగా జిల్లా జట్లు



విజేతలుగా నిలిచిన బాలబాలికల జట్లు

నరసరావుపేట రూరల్: ఏపీ సబ్ జూనియర్స్ 9వ ఆట్యాపాట్యా రాష్ట్రస్థాయి పోటీలలో పల్నాడు జిల్లా బాల బాలికల జట్లు విజేతలుగా నిలిచాయి. నెల్లూరు బీవీఎస్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో ఈనెల 5,6 తేదీలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా జట్లు ప్రతిభ కనబర్చాయి. బాలుర జట్టు ఎన్‌టీఆర్ జిల్లా జట్టుపై, బాలికల జట్టు విశాఖపట్నం జట్టుపై ఫైనల్స్‌లో గెలుపొందాయి. జట్లకు శిక్షకులుగా సిహెచ్ పుల్లయ్య, జి.ఝాన్సీరాణి వ్యవహరించారు. విజేతలుగా నిలిచిన జిల్లా జట్లను రాష్ట్ర సీఈఓ రంభా దుర్గాప్రసాద్, రాష్ట్ర అధ్యక్షుడు జాబేజ్, కార్యదర్శి రంభా శ్రీచరణ్, ఎల్ఐసీ డివిజనల్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్ శ్యామ్, ఆట్యాపాట్యా జిల్లా కార్యదర్శి వున్నం రోహిత్, జిల్లా సభ్యులు అభినందించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

దాచేపల్లి: నడికుడి రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని జీఆర్పీ పోలీసులు సోమవారం గుర్తించారు. రెండవ నెంబర్ ప్లాట్ ఫారం పట్టాలపై సుమారుగా 50 సంవత్సరాల వయస్సున్న వ్యక్తి మృతిచెందినట్లుగా పోలీసులు గుర్తించారు. తెలుపు రంగు ఫుల్‌చేతుల చొక్కా, బ్లూకలర్ ప్యాంట్, కుడిచేతి ఉంగరం వేలికి వెంకటేశ్వరస్వామి బొమ్మకలిగిన వెండి ఉంగరం ధరించుకుని ఉన్నాడు. మృతుడి ఆచూకీ తెలిసిన వ్యక్తులు పూర్తి వివరాల కోసం నడికుడి జీఆర్పీ పోలీసులను సంప్రదించాలని చెప్పారు. రైలుకింద పడటం వలనే మృతిచెందినట్లుగా పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మోసపోయాం.. న్యాయం చేయండి

- జిల్లా పోలీసు ప్రజాసమస్యల పరిష్కార వేదికలో బాధితుల మొర
- 73 ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు ఎస్పీ సంతోష్



బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జిల్లా ఎస్పీ, అదనపు అడ్మిన్ ఎస్పీ జేవీ సంతోష్‌లు వేర్వేరుగా అధ్యక్షత వహించి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారిచే 73 ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజలు వివిధ సమస్యలపై అర్జీలను అందించారు.

మా పొక్లెయిన్‌ను ఇప్పించండి

మేం రెండేళ్ల క్రితం ఒక ఫైనాన్స్ కంపెనీ వద్ద రూ.20లక్షలు రుణంగా తీసుకొని పొక్లెయిన్‌ను కొనుగోలు చేశాం. అప్పటి నుంచి ప్రతి నెలా సంస్థకు చెల్లించాల్సిన డబ్బులు చెల్లిస్తున్నాం. ఈఏడాది ఆగస్టు 17న పొక్లెయిన్‌ను బలవంతంగా మా వద్ద నుంచి తీసుకొని నరసరావుపేటకు తరలించారు. వారికి చెల్లించాల్సిన డబ్బులు మొత్తం చెల్లించాం. మా పొక్లెయిన్‌ను మాకు ఇవ్వాలని కోరుతుంటే మీకు దిక్కున్నచోట చెప్పుకోండి, కోర్టుకు పోండి అంటూ మమ్మల్ని బెదిరిస్తున్నారు. మా పొక్లెయిన్‌ను మాకు ఇప్పించి న్యాయం చేయండి.

– దార్ల శ్రీలక్ష్మి, నరసంహారావు దంపతులు, మాచర్ల

అమెరికాలో ఫీజు చెల్లిస్తానంటూ మోసం చేశారు

మా కుమారుడు అమెరికాలో ఎంఎస్ చేరాడు. అతడికి చెల్లించాల్సిన సెమిస్టర్ ఫీజు రూ.5.70లక్షల్లో రూ.4.5లక్షలు డబ్బులు ఇక్కడ మాకు ఇస్తే దానికి కొంతకలిపి అమెరికాలోని యూనివర్సిటీకి చెల్లిస్తామంటూ మణికంఠ, హరిశ్చంద్ర అనే వ్యక్తులు నమ్మబలికి నా వద్ద నుంచి ఆ మొత్తం తీసుకున్నారు. తీరా చూస్తే వారు డబ్బులు చెల్లించలేదు. డబ్బులు ఇవ్వమంటే చుట్టూ తిప్పకుంటున్నారు. నా డబ్బులు ఇప్పించి న్యాయం చేయండి.

– కొల్లి ఆంజనేయులు, పిట్టంబండ, వినుకొండ రూరల్

రూ.80లక్షలు ఎగ్గొట్టి నోటీసులు పంపారు

మా ఊరికి చెందిన హనుమంతరావు అనే వ్యక్తి మమ్మల్ని బాగా నమ్మించి గ్రామంలోని వృద్ధులు, రైతుల నుంచి సుమారు రూ.80లక్షలు అప్పు గా తీసుకున్నాడు. అన్నింటికి ప్రోనోట్లు రాసిచ్చాడు. తీసుకున్న డబ్బులు ఇవ్వమంటే తాను మరొకరికి ఇచ్చానని, ఆ వ్యక్తి ఎగ్గొట్టాడని అందువలన నేను ఇవ్వలేను, మీకు చేతనైనది చేసుకోండి అంటున్నాడు. గ్రామంలో పెద్దమనుషుల పంచాయతీలో తీసుకున్న డబ్బులు తిరిగి ఇస్తానని అ గ్రిమెంట్లు రాసిచ్చాడు. తీరా కోర్టు నుంచి నోటీసులు పంపించాడు.

– నాగేశ్వరరావు, కేశవరావు, సత్యవతి, బెల్లంకొండ మండలం చంద్రాజుపాలెం గ్రామస్తులు

స్థలం రిజిస్ట్రేషన్ చేయడం లేదు

కాకాని పరిధిలో ఒక రియల్‌ఎస్టేట్ వారు వేసిన వెంచర్‌లో 200 చదరపు గజాల స్థలం మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లక్ష్మణ్ నాయక్ ఇప్పించారు. దానికి సంబంధించి మొత్తం డబ్బులు చెల్లించాను. అయినప్పటికీ రిజిస్ట్రేషన్ చేయించకుండా ఫోన్ చేసినప్పటికీ లిఫ్ట్ చేయకుండా తప్పించుకు తిరుగుతున్నారు. వారిపై చర్య తీసుకొని ఆ భూమి రిజిస్ట్రేషన్ చేయించండి.

– సూపూరి విష్ణుమూర్తి, అల్లూరివారిపాలెం, నరసరావుపేట మండలం

ఫీజు చెల్లించకుండా మోసం

నా కుమారుడు పై చదువుల నిమిత్తం యూరప్‌కు పంపించాలని రూ.10లక్షలు లలిత ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం, హోటల్ మేనేజ్మెంట్ అబ్రాడ్ బిజినెస్ కన్సల్టెన్సీ మేనేజర్ సునీతకు రెండేళ్ల క్రితం చెల్లించాం. ఇప్పటివరకు ఆ డబ్బులు యూరప్‌కు పంపలేదు. మోసం చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకొని న్యాయం చేయండి.

–పరుచూరి ఆంజనేయులు, రామిరెడ్డిపాలెం, రొంపిచర్ల

రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

2019 నుంచి డి.పూర్ణచంద్రరావుతో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయంతో అతను సుమారు మూడేళ్ల క్రితం నాకు రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తానని పలు దఫాలుగా రూ.60 లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగం ఇప్పించలేదు, డబ్బులు తిరిగి ఇవ్వలేదు. మోసం చేసిన అతనిపై చర్యలు తీసుకోండి.

– ఉర్లగొండ సాంబశివరావు, సత్తెనపల్లి

డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్‌పై చర్యలు తీసుకోండి


కలెక్టర్‌కు ఫిర్యాదుచేసిన సస్పెన్షన్‌కు గురైన ఉద్యోగి నాగమల్లేశ్వరరావు



నరసరావుపేట: డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్‌పై సస్పెన్షన్‌లో ఉన్న ఆ శాఖ ఉద్యోగి నాగమల్లేశ్వరరావు సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. శాఖలోని ఉద్యోగులను వ్యక్తిగతంగా దూషిస్తూ భౌతిక దాడులకు పాల్పడుతున్నాడని, సుమారు రూ.5కోట్ల వరకు నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డాడనట్లు ఫిర్యాదుదారు పేర్కొన్నారు. అనంతరం కలెక్టరేట్ వద్ద మీడియాతో మాట్లాడుతూ .. గతంలో ఇదే విషయంపై అప్పటి కలెక్టర్ ఎల్.శివశంకర్‌కు ఫిర్యాదుచేసినా చర్యలేమి తీసుకోలేదని వాపోయాడు. పీడీ నాయక్ తనను వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకొని ఎటువంటి ఆధారాలు లేకుండానే అప్పటి కలెక్టర్ ద్వారా సస్పెండ్ చేయించారన్నారు. వాస్తవానికి తమ విభాగ జీఓల ప్రకారం సస్పెండ్ చేసే అధికారం కలెక్టర్‌కు లేకపోయినా మిస్‌గైడు చేసి తనను బాలూనాయక్ సస్పెండ్ చేయించారన్నారు. దీనిపై తాను హైకోర్టుకు వెళ్లానని, నివేదిక ఇవ్వాలని కోర్టు కోరిందన్నారు. దీనిపై సమాధానం ఇవ్వలేక, ఆధారాలు చూపలేక కేసు విత్‌డ్రా చేసుకోవాలని, లేనిపక్షంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టిస్తానని తనను వ్యక్తిగతంగా బెదిరిస్తూ తన వ్యక్తులచేత ఇళ్లపై దాడులు చేయిస్తున్నాడన్నారు. ఇప్పుడు పూర్తి ఆధారలతో జిల్లా కలెక్టర్‌కు మరోసారి ఫిర్యాదు చేశానని చెప్పారు. దీనిపై జేసీ నివేదిక ఇవ్వాలని కోరారన్నారు. తాను జేసీకి అన్నీ ఆధారాలు సమర్పించానని చెప్పారు. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను గ్రామాలకు కేటాయించకుండా తన సొంతానికి వాడుకుంటున్నాడని, సుమారు రూ.4కోట్ల నుంచి రూ.5కోట్ల అవినీతికి పాల్పడ్డాడని ఆరోపించారు. త్వరలో ఏసీబీకి ఆధారాలు సమర్పిస్తానని పేర్కొన్నారు.

కౌలు రైతుల కష్టం కోసం ప్రత్యేక చట్టం

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెంనాయుడు



మాట్లాడుతున్న మంత్రి అచ్చెంనాయుడు

గుంటూరు వెస్ట్ :రాష్ట్రంలో 80 నుంచి 90 శాతం భూములను కౌలు రైతులే సాగు చేస్తున్నారని, అయితే వారికి ఆశించిన స్థాయిలో లాభం రావడం లేదని, వారి హక్కుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకొస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెంనాయుడు చెప్పారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో మంత్రి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ సాగుదారుల హక్కు చట్టం 2024కు సంబంధించి ఎన్టీఆర్ జిల్లా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాలతో తొలి ప్రాంతీయ సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ 1956లో కౌలుదారుల చట్టం అప్పటి ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ఆతరువాత 2011లో మరో చట్టం వచ్చిందని, అయితే ఈ చట్టం 2016 వరకు అమలు కాలేదని తెలిపారు. తమ ప్రభుత్వ హయాంలోనే ఈ చట్టాన్ని 0 నుంచి దాదాపు 40 శాతానికి పైగా కౌలు దారులకు ఉపయోగపడేలా అమలు చేశామన్నారు. భూమిలో కాయకష్టం చేసి పనిచేసే కౌలు రైతుకు జరిగే అన్యాయాలు ఈ నూతన చట్టంతో చాలా వరకు సమసి పోతాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో కౌలు రైతులు దారుణ నిర్లక్ష్యానికి గురయ్యారని పేర్కొన్నారు. ఈ నూతన చట్టం గ్రామసభలు నిర్వహించి పూర్తి వివరాలు వెల్లడించిన తరువాతే అమలులోకి తెస్తారన్నారు. ముఖ్యంగా రైతాంగం ఆధునిక వ్యవసాయ పరికరాలను మరింత పెంచుకుంటే వ్యవసాయ ఖర్చులు తగ్గుతాయన్నారు. ఈ చట్టం ద్వారా భూ యజమానులకు ఎలాంటి నష్టం లేకుండా, కౌలు చేసే రైతులకు ఉపయోగం ఉండేలా రూపకల్పన చేశామన్నారు. వ్యవశాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్ మాట్లాడుతూ వ్యవసాయం చేసే రైతుకు ఫలం దక్కాలనే సిద్ధాంతంతో ఈ చట్టాలు రూపకల్పన చేశామన్నారు. ఇటీవల కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ రాష్ట్ర పర్యటనకు వచ్చినప్పుడు ఈ చట్టంపై ఆయనతో చర్చించడంతోపాటు, వివరాలు అందజేశామన్నారు. ఈ చట్టం ద్వారా భూమి సాగు చేసే రైతులకు కేంద్ర ప్రభుత్వం అందించే పీఎం కిసాన్ రూ. 6వేలు కూడా వారికే దక్కుతోందన్నారు. ఈ చట్టం ద్వారా భూ యజమానులు ఎటువంటి ఇబ్బందులు పడాల్సిన పని లేదన్నారు. అనంతరం ఐదు జిల్లాల నుంచి వచ్చిన రైతులు చట్టం అమలుపై రైతుల సమస్యలపైన పలు సూచనలు, ఇబ్బందులను మంత్రికి తెలిపారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎస్.ఢిల్లీరావు, అడిషనల్ డైరెక్టర్ శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ, శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్రకుమార్, తెనాలి శ్రావణ్ కుమార్, గల్లా మాధవి, జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనిక్రిస్టినా పాల్గొన్నారు.

పసికందు కిడ్నాప్

- గంటల వ్యవధిలో ఛేదించిన పోలీసులు
- జీజీహెచ్ నుంచి ఒక్క రోజు వయసు బాబును ఎత్తుకెళ్లిన నిందితులు



దొంగలించబడిన బిడ్డను తీసుకువచ్చిన పోలీసులు, నర్సు చేతిలో పురిటి బిడ్డ, పక్కన నిందితులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

పట్నంబజారు: ఒక్కరోజు చిన్నారిని అపహరించుకుని పోయిన ఘటన గుంటూరులో కలకలం సృష్టించింది. అయితే గంటల వ్యవధిలోనే పోలీసులు చిన్నారి జాడ తెలుసుకుని క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. గుంటూరు జీజీహెచ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ వివరాలు వెల్లడించారు. గుంటూరు రూరల్ మండలం గోరంట్ల గ్రామానికి చెందిన షేక్ నసీమాను ఈనెల 6వ తేదీ రాత్రి 10 గంటలకు కుటుంబ సభ్యులు డెలివరీ నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అదేరోజు రాత్రి 1 గంట సమయంలో నసీమాకు మగ బిడ్డ జన్మించాడు. 7వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో గుర్తుతెలియని మహిళ బాలింతరాలిగా నటిస్తూ ప్రసూతి వార్డులోకి ప్రవేశించింది. నసీమాతో మాటలు కలిపి శిశువును ముద్దాడుతూ బలవంతంగా బయటకు తీసుకొచ్చింది. అరగంట అయినప్పటికీ తిరిగి మహిళ రాకపోవడంతో నసీమా తల్లిదండ్రులు, బంధువులకు విషయం తెలిపింది. పోలీసులకు సమాచారాన్ని ఇవ్వగా, ఎస్పీ సతీష్‌కుమార్ ప్రత్యేక బృందాలను రంగంలో దించారు. సీసీ పుటేజీల ఆధారంగా ఆటో నంబరు కనుగొన్న పోలీసులు ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆటోను పట్టుకున్నారు. ఇరువురు మహిళలతోపాటు, ఒక మగవ్యక్తితోపాటు మరో వ్యక్తి కలిసి శిశువును తీసుకెళ్లారని ఆటోడ్రైవర్ పోలీసులకు తెలిపాడు. ఆర్టీసీ బస్టాండ్‌లో సీసీపుటేజీ పరిశీలించిన పోలీసులు అచ్చంపేట మండలం కోనూరు గ్రామానికి చెందిన వ్యక్తులుగా దర్యాప్తులో నిర్ధారించారు. చింతపల్లి మంగమ్మ, ఆమె కుమార్తె బోరుగడ్డ శిరీష, ఆమె భర్త ప్రేమ్‌రాజులు పసికందును తీసుకెళ్లినట్లు గుర్తించారు. కోనూరు గ్రామంలోని వారి నివాసానికి వెళ్లి చూడగా, శిశువు కనిపించడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. మూడు గంటల వ్యవధిలోనే పోలీసులు పసికందు ఆచూకీ గుర్తించి క్షేమంగా పసికందును తల్లిదండ్రులకు అప్పగించారు. శిరీష పోలీసుల విచారణలో తాను కూడా ప్రసూతి వార్డులో బిడ్డకు జన్మనిచ్చానని చెప్పినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు చేయాల్సి ఉందని, నిందితులను విచారించిన అనంతరం వివరాలు వెల్లడిస్తామన్నారు. గతంలో ఇలాంటి ఘటనలకు పాల్పడ్డారా అనే కోణంలో దర్యాప్తు చేయాల్సి ఉందని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ మాట్లాడుతూ గతనెల 20వ తేదీన బిరుదగల శిరీష అనే మహిళ ఆసుపత్రిలో చేరిందని, ఆమెకు పుట్టిన చిన్నారికి గుండెల్లో స్వల్ప ఇబ్బంది ఉండటంతో 25వ తేదీన మృతిచెందిందని తెలిపారు. చిన్నారిని అపహరించిన శిరీష ప్రసూతి వార్డులో చేరిందా లేదా అనే అంశంపై పూర్తిస్థాయి విచారణలో తేలాల్సి ఉందన్నారు. శిశువు ఆచూకీ తెలుసుకోవడంతో ప్రతిభ కనబర్చిన కొత్తపేట పోలీసుస్టేషన్ సీఐ వీరయ్య, సిబ్బందిని అభినందించడంతోపాటు, సహకరించిన పల్నాడు జిల్లా పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తి అవసరం

- షార్ శాస్త్రవేత్తలు గ్రహదురై, రవికుమార్
- ఎన్ఈసీలో వరల్డ్ స్పేస్ వీక్–24
- పాల్గొన్న జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



మాట్లాడుతున్న గ్రహదురై,వేదికపై షార్ జనరల్ మేనేజర్ రవికుమార్, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట రూరల్: అంతరిక్ష పరిశోధనలపై విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలని ఎస్‌డీఎస్‌సీ షార్ డిప్యూటీ డైరెక్టర్ జి.గ్రహదురై తెలిపారు. నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజులపాటు నిర్వహించనున్న వరల్డ్ స్పేస్ వీక్–2024 ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో షార్ డిప్యూటీ డైరెక్టర్ గ్రహదురై, షార్ జనరల్ మేనేజర్, శాస్త్రవేత్త కెవిఎస్ రవికుమార్, జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా షార్ శాస్త్రవేత్తలు మాట్లాడుతూ 1957 అక్టోబర్4వ తేదీన తొలి కృత్రిమ ఉపగ్రహం స్పుత్నిక్‌ను రష్యా అంతరిక్షంలోకి పంపటం జరిగిందన్నారు. 1967 అక్టోబర్ 10న రెండవ కృత్రిమ ఉపగ్రహం పంపారని తెలిపారు. దీనికి గుర్తుగా ప్రతి ఏడాది వరల్డ్ స్పేస్ వీక్ ఉత్సవాలను ఇస్రో జరుపుతుందని వివరించారు. ఇస్రో ఇప్పటి వరకు 125 ఉపగ్రహాలను, 97 ఆర్బిటాల్స్‌ను లాంచ్ చేసిందని తెలిపారు. 1969లో 7.5సెం.మీలు ఉన్న రోహిణి ఉపగ్రహం నుంచి ప్రస్తుతం 200 టన్నుల బరువు 3 మీటర్ల వ్యాసం ఉన్న ఎల్‌వీఎం–3 ఉపగ్రహాలను అంతరిక్షానికి పంపే స్థాయికి చేరుకుందని చెప్పారు. ప్రస్తుతం మానవాళి ఉపయోగించే వాహనాలు, ఎలక్ట్రానిక్స్ వస్తువులు, అడవుల నరికివేత వలన వాతావరణ పరిస్థితుల్లో విపరీతమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ షార్, ఇస్రో సంస్థలు మన దేశాన్ని ఎంతో ఉన్నత స్థాయికి తీసుకువెళ్లాయని తెలిపారు. చంద్రయాన్–3 ప్రతిష్టాత్మకమైన ప్రయోగమన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ గ్లోబల్ వార్మింగ్, వేస్ట్ డిస్పోజ్ వంటి ముఖ్య సమస్యలను దేశం ఎదుర్కొంటుందని తెలిపారు. వీటికి పరిష్కారాలు కనుగొనే దిశగా విద్యార్థుల ప్రయోగాలు ఉండాలని సూచించారు. అనంతరం ఇస్రో బృందం ఏర్పాటుచేసిన ప్యానల్స్‌ను అతిథులు ఆవిష్కరించారు. ఎన్ఈసీ కళాశాల విద్యార్థులు తయారుచేసిన మినీ రాకెట్‌ను ప్రయోగించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌ను విద్యార్థులు తిలకించారు. వాతావరణంలో వస్తున్న మార్పులు, అంతరిక్ష పరిశోధనలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, కార్యదర్శి మిట్టపల్లి రమేష్‌బాబు పాల్గొన్నారు.